# నమస్తే ఉదయం

తెలుగు దినపత్రిక

రంగారెడ్డి | సంపుటి : 02 | సంచిక: 92 | పేజీలు: 4 | వెల: 4/- | శుక్రవారం ● 25, అక్టోబర్ 2024 | ఎడిటర్: ఎం.వనితా రెడ్డి




ముఖ్యమంత్రి సహాయనిధికి రూ.కోటి విరాళం అందజేసిన బ్యాంక్ ఆఫ్ బరోడా. జూబ్లీహిల్స్ నివాసంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని కలిసి చెక్‌ను అందజేసిన బ్యాంక్ ఆఫ్ బరోడా జనరల్ మేనేజర్ రితేష్ కుమార్, డీజీఎం ఎంవీఎస్ సుధాకర్.



## ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి
# క్యాబినెట్ సబ్ కమిటీ

- చైర్మన్‌గా భట్టి, సభ్యులుగా శ్రీధర్‌బాబు, పొన్నం, ప్రత్యేక ఆహ్వానితుడిగా కేకే
- నేటి సాయంత్రానికి డీఏలపై ప్రకటన
- ఉద్యోగుల జాక్‌కు సీఎం రేవంత్‌రెడ్డి హామీ

**హైదరాబాద్,అక్టోబర్24(నమస్తే ఉదయం):** తెలంగాణ రాష్ట్రం కోసం ఉద్యమించిన ఉద్యో గులకు తప్పకుండా న్యాయం చేస్తామని సీఎం రేవంత్‌రెడ్డి హామీ ఇచ్చారు. తమది ఎంప్లాయిస్ ఫ్రెండ్లీ గవర్నరమెంట్ అన్న సీఎం.. ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి, క్యాబినెట్ సబ్ కమిటీ వేయనున్నట్లు వెల్లడించారు. తనను కలిసేందుకు వచ్చిన ఉద్యోగుల జేఏసీ ప్రతినిధులతో రేవంత్ భేటీ అయ్యారు. ఉద్యోగుల సమస్యలు పరిష్కరించేందుకు చిత్తశుద్ధితో ఉన్నామన్న రేవంత్.. అందులో భాగంగా వారు ఎదుర్కొంటున్న సమస్యలు పరిష్కరించేందుకు, ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్కతో క్యాబినెట్ సబ్ కమిటీ వేస్తున్నట్లు ప్రకటించారు. అందులో మంత్రులు దుద్దిళ్ల శ్రీధర్‌బాబు, పొన్నం ప్రభాకర్ సభ్యులుగా, కే.కేశవరావు ప్రత్యేక ఆహ్వానితులుగా ఉంటారని వెల్లడించారు. సమస్యల పరిష్కారానికి ఇది తొలి మెట్టు అని అభివర్ణించారు. ఇక శుక్రవారం సాయంత్రానికి డీఏలపై స్పష్టమైన ప్రకటన వెలువడుతుందని హామీ ఇచ్చారు. 317 జీవోపై కమిటీ నివేదిక సమర్పించిన నేపథ్యంలో కేబినెట్ లో నిర్ణయం తీసుకోనున్నట్లు ప్రకటించారు.



## 90 శాతం రైల్వే లైన్ల
# విద్యుదీకరణ

- వరంగల్‌లో రూ.650 కోట్లతో రైల్ మాన్యుఫాక్చరింగ్ యూనిట్ ఏర్పాటు
- 40 రైల్వేస్టేషన్ల అభివృద్ధి
- రానున్న రోజుల్లో మరిన్ని వందేభారత్ రైళ్లు
- రూ.720 కోట్లతో సికింద్రాబాద్ రైల్వేస్టేషన్ అభివృద్ధి పనులు
- హైదరాబాద్ నుంచి యాదాద్రి వరకు ఎంఎంటీఎస్ సేవలు
- ఎంఎంటీస్ ప్రాజెక్టుకు రాష్ట్ర ప్రభుత్వం సుమారు 800 కోట్ల రూపాయలు ఇవ్వాల్సి ఉంది
- దక్షిణ మధ్య రైల్వే పరిధిలో రూ.33 వేల కోట్ల అభివృద్ధి పనులు
- కిషన్ రెడ్డి అధ్యక్షతన తెలంగాణ, కర్నాటక ఎంపీలతో దక్షిణ మధ్య రైల్వే అధికారుల భేటీ
- భేటీలో పాల్గొన్న ఎంపీలు సురేష్ రెడ్డి, కావ్య, రఘునందన్, డీకే అరుణ.
- నియోజకవర్గాల వారీగా రైల్వే అభివృద్ధిపై చర్చ.
- రైళ్ల హాల్టింగ్, కొత్త రైల్వే లైన్లతో పాటు అండర్ పాసులు, బ్రిడ్జిల నిర్మాణంపై చర్చ

**హైదరాబాద్,అక్టోబర్24(నమస్తే ఉదయం):** ప్రధానమంత్రి నరేంద్ర మోదీ లక్ష్యానికి అనుగుణంగా దక్షిణ మధ్య రైల్వే పరిధిలో 90 శాతం రైల్వేలైన్ల విద్యుదీకరణ ప్రక్రియను పూర్తి చేసేలా ముందుకెళ్తున్నాం. 40 రైల్వేస్టేషన్లను అభివృద్ధి చేస్తాం. వరంగల్‌లో రూ.650 కోట్లతో రైల్ మాన్యుఫాక్చరింగ్ యూనిట్ ఏర్పాటు చేయబోతున్నాం. గతంలో ఎన్నడూ లేని విధంగా దక్షిణ మధ్య రైల్వేకు బడ్జెట్‌లో కేటాయింపులు పెంచాం. దక్షిణ మధ్య రైల్వే పరిధిలో 5 వందే భారత్ రైళ్లు ఉన్నాయి. రానున్న రోజుల్లో మరిన్ని వందేభారత్ రైళు తీసుకొస్తాం. రూ.720 కోట్లతో సికింద్రబాద్ రైల్వేస్టేషన్ అభివృద్ధి పనులు వేగ వంతగా జరుగుతున్నాయి. వచ్చే ఏడాది డిసెంబర్ నాటికి పనులు పూర్తవుతాయి. రూ. 430 కోట్లతో చర్లపల్లి రైల్వే టెర్మినల్‌ను త్వరలోనే అందుబాటు లోకి తీసుకొస్తాం.కేంద్ర ప్రభుత్వం హైదరాబాద్ నుంచి యాదాద్రి వరకు ఎంఎంటీఎస్ సేవలు పొడిగిం చాలని నిర్ణయం తీసుకుంది. ఇందుకు మరో రూ.650 కోట్లు కావాల్సి ఉంటుంది.

జంట నగరాల నుంచి యాదాద్రి లక్ష్మీ నర సింహ స్వామి ఆలయ దర్శనానికి వెళ్లే భక్తులకు సౌకర్యాలు కల్పిస్తున్నం. ఎంఎంటీస్ ప్రాజెక్టుకు రాష్ట్ర ప్రభుత్వం సుమారు 800 కోట్ల రూపాయలు ఇవ్వాల్సి ఉంది. రైల్వే అభివృద్ధి పనుల్లో రాష్ట్ర ప్రభుత్వం వెనుకడుగు వేసి, చేతులెత్తేసింది.

రాష్ట్ర ప్రభుత్వం ఏమాత్రం సహకరించక పోయినా ఎంఎంటీఎస్ సెకండ్ ఫేజ్ కింద సర్వీసును పొడిగిస్తున్నాం. మొత్తం దక్షిణ మధ్య రైల్వే పరిధిలో రూ.33 వేల కోట్ల అభివృద్ధి పనులు జరుగుతున్నాయి. ఈ ఏడాది రైల్వే పనుల కోసం సుమారు 6 వేల కోట్లు బడ్జెట్ శాంక్షన్ అయింది.

## ప్రజల కోసం, రైతుల కోసం
# జైలుకు పోతా..

- ఎవ్వని అయ్యకు భయపడేది లేదు
- చట్టం ప్రకారం నడుచుకోండి.. లేదంటే మేము అధికారంలోకి వచ్చాక మిత్తితో సహా చెల్లిస్తాం
- 100 రోజుల్లో అన్ని చేస్తా అన్నా లుచ్చాగాళ్లను జైల్లో పెట్టాల్నా, పేద ప్రజలను జైల్లో పెట్టాల్నా?
- గుజరాత్‌కు ఒక నీతి, మనకు ఒక నీతా?
- మోడీ 15 లక్షలు రాలేదు.. రేవంత్ రెడ్డి 15 వేలు రాలేదు
- ఇక్కడ హౌలా సీఎం ఉన్నాడు
- బెల్లంపల్లి, ఆదిలాబాద్, సింగరేణిపై కూడా అదానీ కన్ను
- ఆదిలాబాద్‌లో జరిగిన రైతు మహాధర్నాలో పాల్గొని ప్రసంగించిన బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్



**ఆదిలాబాద్,అక్టోబర్24(నమస్తే ఉదయం):** కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక ఎక్కడికక్కడే పనులు అక్కడ ఆగిపోయి నయ్. ఆదిలాబాద్‌కు వచ్చేటప్పుడు డిచ్‌పల్లి దగ్గర పోలీసోళ్ల భార్యలు రోడ్డు మీద ధర్నాలు చేస్తున్నారు. కాంగ్రెస్ పాలనలో పోలీసోళ్ల కుటుంబాలను పోలీసోళ్లే గుంజుకుపోయే పరిస్థితి ఉంది. ఇక్కడి వస్తుంటే ఉట్నూరులో నీ మీద పెట్టారు. పోలీసులు నిన్ను అరెస్ట్ చేస్తారేమోనని జోగు రామన్న చెప్పారు. ప్రజల కోసం, రైతుల కోసం జైలుకు పోతా. ఎవ్వని అయ్యకు భయపడేది లేదు. కానీ ప్రజలే మర్లపడి, కాంగ్రెసోళ్లను ఉరికిచ్చి కొట్టే రోజులు దగ్గరలోనే ఉన్నాయి. ఆడ బిడ్డలకు రూ. 2500 ఇస్తా అని అన్నాడు. మరి మహిళలు లైన్ కట్టి పోలీస్ కేసు పెడితే?

రైతులు రైతు భరోసా ఇవ్వలేదని లైన్ కట్టి రైతులు పోలీస్ కేసు పెడితే? నిరుద్యోగులు 2 లక్షల ఉద్యోగాల కోసం కేసులు పెడితే ఒక్క కాంగ్రెసోడైనా మిగతా.. 2లో

## కాంగ్రెస్ పాలకులకు 'మూసీ పునరుజ్జీవం'
# ఏటీఎం

- దేశంలోనే అత్యధికంగా అప్పుల్లో ఉన్నది తెలంగాణ వాసులే
- ఒక్కో కుటుంబంపై సగటున రూ.1,29,599 అప్పు
- జాతీయ సగటు కంటే రూ.40 వేలు ఎక్కువ
- రాష్ట్రంలో దాదాపు 92 శాతం కుటుంబాలు అప్పుల్లోనే
- కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్



**హైదరాబాద్,అక్టోబర్24(నమస్తే ఉదయం):** "మూసీ పునరుజ్జీవం" పేరుతో కాంగ్రెస్ ప్రభుత్వం పేదల ఇండ్ల కూల్చివేయడాన్ని భార తీయ జనతా పార్టీ పక్షాన తీవ్రంగా వ్యతిరేకి స్తున్నాం. ఈ పథకం పేరుతో కాంగ్రెస్ పార్టీ భారీ ఎత్తున అవినీతికి తెరదీస్తోంది.

రూ.1 లక్షా 50 వేల కోట్ల వ్యయంతో చేప డుతున్న ఈ ప్రాజెక్టును కాంగ్రెస్ పార్టీ ఏటీ ఎంలాగా ఉపయోగించుకోవాలనుకుం టోంది. ఉద్యోగులకు జీతాలివ్వడమే గగనమైంది. గత పాలకులు చేసిన దాదాపు మిగతా.. 2లో

## ప్రైవేట్ దళారులకు 2100 అమ్ముకొని
# రైతులు 700 నష్టపోతున్నారు

- రైతులు కల్లాల దగ్గర వడ్లు అరబోసుకుంటున్నారు
- వర్షాలకు ధాన్యం తడిసిపోతుంది
- 500 రూపాయల బోనస్ ఎగ్గొట్టడానికే
- బీఆర్ఎస్ సీనియర్ నేతలు, మాజీ మంత్రి ప్రశాంత్‌రెడ్డి



**హైదరాబాద్,అక్టోబర్24(నమస్తే ఉదయం):** ప్రతిపక్షాలు డిమాండ్ చేయడంతో నామ మాత్రపు కొనుగోలు సెంటర్లు ప్రారంభించారు. ఆర్భాటంగా 4,5 రోజుల క్రితం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసి మిగతా.. 2లో

# ప్రధాని మోడీ, అమిత్ షాలతో ఒమర్ భేటీ



- కాశ్మీర్‌కు రాష్ట్ర హోదా పునరుద్దరణపై వినతి

**న్యూఢిల్లీ,అక్టోబర్24(నమస్తే ఉదయం):** జమ్మూకశ్మీర్ ముఖ్యమంత్రిగా బాధ్యతలు స్వీకరించిన తర్వాత తొలిసారి ఢిల్లీలో పర్యటిస్తోన్న నేషనల్ కాన్ఫరెన్స్ నేత ఒమర్ అబ్దుల్లా గురువారం ప్రధాని మోదీతో భేటీ అయ్యారు. ప్రధాని మోడీ, హోంమంత్రి అమిత్ షాలతో భేటీలో జమ్మూ కశ్మీర్‌కు రాష్ట్ర హోదాను పునరుద్ధరిం చాలని కోరారు. ఇదే మిగతా.. 2లో

# ధాన్యం కొనుగోళ్లకు 20 వేల కోట్ల నిధులు

- ఖరీఫ్‌లో రికార్డ్ స్థాయి ధాన్యం దిగుబడి
- 150 లక్షల మెట్రిక్ టన్నుల దిగుబడి అంచనా
- సన్నాలకు ప్రోత్సాహకరంగా 500 బోనస్
- సాగునీటి రంగానికి 28,000 కోట్లు
- జనవరి నుండి తెల్ల రేషన్ కార్డు దారులకు సన్నబియ్యం
- సస్యశ్యామలంగా సూర్యాపేట జిల్లా
- సూర్యాపేట జిల్లా కేంద్రంలో జిల్లా అధికారులు,వివిధ రంగాలలో నిష్ణాతులు,కవులు కళాకారులతో గవర్నర్ సమావేశం
- సూర్యాపేట గవర్నర్ సభలో రాష్ట్ర మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి
- కార్యక్రమంలో పాల్గొన్న రాష్ట్ర నీటిపారుదల మరియు పౌర సరఫరాల శాఖ మంత్రి ఎన్. ఉత్తమ్ కుమార్ రెడ్డి, కోదాడ శాసనసభ్యురాలు ఉత్తమ్ పద్మావతి



**సూర్యాపేట,అక్టోబర్24(నమస్తే ఉదయం):** ఖరీఫ్ సీజన్ లో ధాన్యం కొనుగోళ్లకై 20 వేల కోట్ల నిధులు కేటాయించినట్లు రాష్ట్ర నీటిపారుదల మరియు పౌర సరఫరాల శాఖామంత్రి ఎన్. ఉత్తమ్ కుమార్ రెడ్డి వెల్లడించారు. తెలంగాణలో ఖరీఫ్ పంట రికార్డ్ స్థాయిలో దిగుబడి కానున్నట్లు ఆయన పేర్కొన్నారు. దాదాపు 150 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం దిగుబడి అవుతుందన్న అంచనా వేస్తున్నట్లు ఆయన తెలిపారు.

గురువారం రోజున సూర్యాపేట జిల్లా కేంద్రంలో రాష్ట్ర గవర్నర్ జిష్ణు దేవ్ వర్మ జిల్లా అధికారులతో పాటు జిల్లాకు చెందిన వివిధ రంగాలలో నిష్ణాతులు,స్వాతంత్ర్య సమర యోధులు,సమాజ సేవకులతో మిగతా.. 2లో

## సింగరేణి కార్మికులకు
# నేడే దీపావళి బోనస్ చెల్లింపు



- బోనస్ కింద రూ.358 కోట్లు విడుదల
- గత ఏడాది కన్నా ఇది రూ. 50 కోట్లు అధికం
- ఒక్కొక్క కార్మికునికి రూ.93,750 బోనస్ చెల్లింపు
- శుక్రవారం మధ్యాహ్నం కల్లా కార్మికుల ఖాతాల్లో బోనస్ జమ
- ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క మల్లు

**హైదరాబాద్, అక్టోబర్24(నమస్తే ఉదయం):** దీపావళి బోనస్‌గా పిలవబడే పి.ఎల్.ఆర్.ఎస్. (ప్రొడక్షన్ లింక్డ్ రివార్డ్ స్కీమ్) బోనస్‌ను నేడు (శుక్రవారం) సింగరేణి కార్మికులకు చెల్లిస్తున్నట్లు రాష్ట్ర ఉపముఖ్యమంత్రి, ఇంధన శాఖ మంత్రి భట్టి విక్రమార్క మల్లు గురువారం సచివా లయంలో ప్రకటించారు. దీని కోసం సింగరేణి సంస్థ 358 కోట్ల రూపాయలను విడుదల చేయాలని సింగరేణి సీఎండీ ఎన్. బలరామ్ ను ఆదేశించారు. గురువారం రాష్ట్ర సచివాలయంలో సింగరేణిపై సమీక్ష సందర్భంగా ఈ మేరకు ఆదేశాలు జారీ మిగతా.. 2లో

# ప్రజల కోసం, రైతుల కోసం జైలుకు పోతా..

(మొదటి పేజీ తరువాయి)

మిగులుతాడా? మేము పదేళ్లు ఉన్నాం. ఎప్పుడు ఇలాంటి పిచ్చి పనులు చేయలేదు. పోలీసులు, ప్రభుత్వ ఉద్యోగులు న్యాయంగా, ధర్మంగా నడుచుకోవాలే. ఎవరైనా ఎక్కువ చేస్తే పేర్లు రాసి పెట్టుకోండి మిత్తి తో ఇస్తాం. పెద్ద పెద్దోళ్లను చూసినం. రాజశేఖర్ రెడ్డి, చంద్రబాబుతోనే కొట్లాడినం. ఈ చిట్టి నాయుడు ఎంత? వీడిని చూసి మనం భయపడాల్నా? ప్రభుత్వ అధికారుల విషయంలో మళ్లీ చెబుతున్నా? చట్టం ప్రకారం నడుచుకోండి. లేదంటే మేము అధికారంలోకి వచ్చాక మిత్తితో సహా చెల్లిస్తాం.

హైడ్రా పేరుతో హైదరాబాద్ లో 2 వేల ఇళ్లు కూలగొట్టేందుకు వెళ్లారు. ఇళ్లు కూలగొడతా అంటే ఒక పెద్దమనిషి ఒక మాట అన్నందుకు ఒకాయనను జైల్లో పెడతారంటా. 100 రోజుల్లో అన్ని చేస్తా అన్నా లుచ్చా గాళ్లను జైల్లో పెట్టాల్నా, పేద ప్రజలను జైల్లో పెట్టాల్నా? గరీబులు, రైతులు, విద్యార్థులు, నా మీద కేసులు పెడతా అంటే ఊరుకునే వాళ్లు ఎవరు లేరు.

మహారాష్ట్రలో ఎన్నికలు ఉన్నాయి. మీ పక్కనే ఉన్న మహారాష్ట్ర కు వెళ్లి కాంగ్రెస్ మోసాలను చెప్పండి. మొత్తం అడ్డగోలు హామీలు ఇచ్చి తెలంగాణ ప్రజలను ఎట్ల మోసం చేశారో వాళ్లకు చెప్పండి. కాంగ్రెస్ లుచ్చా గాళ్లకు ఓట్లేస్తే మళ్లీ మోసం జరుగుతుదని మహారాష్ట్ర వాళ్లకు చెప్పాలె.

ఉద్యమంలో ఆదిలాబాద్ ముందు ఉన్నది. ఇప్పుడు కాంగ్రెస్ ప్రభుత్వం పై కూడా ఇక్కడి నుంచే అగ్గి అంటుకున్నది. ఇక్కడి ముకురా రైతులు కాంగ్రెస్ లుచ్చాలు ఇచ్చిన హామీలు ఏమయ్యాయని రాహుల్ గాంధీకి పోస్ట్ కార్డులు రాసి పోస్ట్ కార్డు ఉద్యమం స్టార్ట్ చేశారు. కొమురం భీమ్ పుట్టిన గడ్డలో ఇలాంటి ఉద్యమాలు ఇంకా వస్తాయి. ఇక్కడ రైతులు రుణమాఫీ కాలేదని దిష్టిబొమ్మలు కాలబెడితే వాళ్లను జైల్లో పెడతారంట. రైతులు జైలుకు వెళ్లాల్సిన అవసరం లేదు. మాకు మీరు శక్తిని ఇవ్వండి మీకోసం మేము జైలుకు వెళ్తాం.

కాంగ్రెస్ కంటే బీజేపీ వాళ్లు మరీ ప్రమాదకరం. ఇక్కడ ఎమ్మెల్యే, ఎంపీ బీజేపీ వ్యక్తే. గుజరాత్ లో పత్తి క్వింటాలుకు రూ. 8800 అంట. అక్కడికి కన్నా మనకు తక్కువ ఇస్తారంట. గుజరాత్ కు ఒక నీతి, మనకు ఒక నీతా? గుజరాత్ లో కంటే తెలంగాణ పత్తి క్వాలిటీ అని పరిశ్రమ వర్గాల వాళ్లే నేను మంత్రిగా ఉన్నప్పుడు చెప్పారు. గుజరాత్ లో ఇచ్చినట్లే పత్తికి రూ. 8800 ఇవ్వాలె. లేదంటే కాంగ్రెస్ పై ఎట్ల కొట్లాడుతామో బీజేపీ పై అట్లనే కొట్లాడుతాం.



సిమెంట్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియాను స్టార్ట్ చేస్తామని హామీ ఇచ్చారు. మరీ ఇప్పటి వరకు స్టార్ అయ్యిందా? మోడీ 15 లక్షలు రాలేదు. రేవంత్ రెడ్డి 15 వేలు రాలేదు. అక్కడ జుమ్లా పీఎం ఉన్నాడు. ఇక్కడ హౌలా సీఎం ఉన్నాడు. బీసీ లకు స్థానిక సంస్థల్లో రిజర్వేషన్లు, బీసీ సబ్ ప్లాన్ అన్నాడు.

మైనార్టీ, యువజన, మహిళా డిక్లరేషన్ అన్నాడు. ఎవ్వరినీ వదలకుండా మోసం చేశారు. ఇంకా మూడేళ్లు కొట్లాడేది ఉంది. ఆదిలాబాద్ ప్రజలు మాకు పోరాటం తొవ్వ చూపారు. రుణమాఫీ, రైతు భరోసా, రైతు భీమా వచ్చే వరకు మనం పోరాటం చేయాల్సిందే. బోనస్ బోగస్ అయ్యింది, పత్తి రైతు చిత్తు అయ్యిండు, రైతు భరోసా దిక్కు లేదు.

రైతుల కల్లాల వద్దకు మనమే పోదాం. కొనుగోలు కేంద్రాల వద్దనే నిలదీద్దాం. బీఆర్ఎస్ అంటే భారత రైతు సమితి. రైతుల పక్షాన ఉండి పోరాటం చేస్తాం. మరికొన్ని రోజులు అయితే వీళ్ల ఏడాది మాసికం పెట్టాల్సిన పరిస్థితి ఉంటుంది. రాష్ట్రమంతా కూడా కాంగ్రెస్ పార్టీకి బుద్ధి వచ్చేదాకా మనం పోరాటం చేస్తూనే ఉందాం.

కేసీఆర్ ఉన్నప్పుడు మతం పేరుతో రాజకీయాలు చేయలేదు. మనిషిని మనిషిగా చూస్తూ అందరికీ ప్రయోజనం చేశారు. హిందూ మహిళలకు బతుకమ్మ చీరలు ఇస్తే, ముస్లింలకు, క్రైస్తవులకు రంజాన్, క్రిస్ మస్ తోఫా ఇచ్చారు. మతాన్ని చూడకుండా అందరూ బాగు పడాలనే ప్రయత్నం చేశారు.

మైనార్టీ గురుకులాలు ఏర్పాటు చేసి ఒక్కో విద్యార్థి పై లక్షా రూపాయలకు పైగా ఖర్చు చేశారు. బీజేపీ, కాంగ్రెస్ మాటలు నమ్మకండి. తండ్రి సమానుడైన కేసీఆర్ అందరి కోసం పనిచేస్తారు. నల్గొండ జిల్లా రామన్న పేట వద్ద అదానీ సిమెంట్ ఫ్యాక్టరీ పెట్టాలని చూస్తే అక్కడి ప్రజలు ఫ్యాక్టరీకి వ్యతిరేకంగా ర్యాలీ చేశారు.

సిమెంట్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా పై కూడా అదానీ కన్ను పడింది. ఇక్కడ కూడా అదే ప్రయత్నం జరుగుతుంది. బెల్లంపల్లి, ఆదిలాబాద్, సింగరేణిపై కూడా అదానీ కన్ను ఉంది. దాన్ని గుత్తకు పెట్టారు. అందుకే మనం గట్టిగా ఉండాల్సిన అవసరం ఉంది.

రాహుల్ గాంధీ చౌకిదార్ చోర్ హై అంటాడు. రేవంత్ రెడ్డి మాత్రం మోడీ మేరా బఢే భాయ్ అంటాడు. అదానీ ఫ్రాడ్ అని రాహుల్ గాంధీ అంటే%ా%.రేవంత్ రెడ్డి మాత్రం అదానీ మేరా దోస్త్ అంటాడు. పైన తిడుతారు. కింద మాత్రం దోస్త్ చేస్తారు.

కాంగ్రెస్, బీజేపీ తోడు దొంగలు. రేవంత్ రెడ్డికి రాహుల్ గాంధీ ఫోన్ చేసి, నేను అదానీని తిడుతుంటే నువ్వెందుకు దోస్త్ చేస్తున్నావని అని అడగవచ్చు కదా? ఈ దొంగల నుంచి తెలంగాణను కాపాడుకోవాలంటే ఉన్నది ఒక్క కేసీఆర్ మాత్రమే. తెలంగాణకు కేసీఆర్ మాత్రమే శ్రీరామరక్ష. తెలంగాణ తెచ్చిన కేసీఆర్ బాటలో నడుద్దాం.

## కాంగ్రెస్ పాలకులకు 'మూసీ పునరుజ్జీవం' ఏటీఎం

(మొదటి పేజీ తరువాయి)

రూ.6 లక్షల కోట్ల పైచిలుకు అప్పులకు 10 నెలల్లోనే రూ.60 వేల కోట్లు వడ్డీల రూపంలో చెల్లిస్తూ ప్రజాధనాన్ని వృథా చేస్తోంది. గత బీఆర్ఎస్ ప్రభుత్వం చేసిన అప్పులకు వడ్డీలు చెల్లించడానికే నానా తంటాలు పడుతూ సంక్షేమ పథకాలను అమలు చేయలేని పరిస్థితి నెలకొంది. ఈ డబ్బుల్లేక రాష్ట్ర ప్రభుత్వం తీవ్రమైన ఆర్థిక సంక్షోభంలో కొట్టుమిట్టాడు తోంది. ఈ పరిస్థితుల్లో మరో లక్షన్నర కోట్ల రూపాయల మేరకు అప్పు చేసి మూసీ పున రుజ్జీవం పేరుతో పేదల ఇండ్లను కూల్చాలను కోవడం దుర్మార్గం. ఇప్పటికే మూసి ప్రక్షాళన పేరుతో గత మూడు దశాబ్దాలుగా జైకా, జపాన్ సహా ఇతరత్రా మార్గాల ద్వారా పెద్ద ఎత్తున నిధులు కూడా ఖర్చు చేశారు. మూసీ సుందరీ కరణ పేరుతో పాలకులు తమ స్వార్థ ప్రయోజనాల కోసం నిధులు ఖర్చు చేస్తున్నారే తప్ప మూసీ పరిస్థితి ఏ మాత్రం మారలేదు.

గత పాలకులు లక్ష కోట్ల రూపాయలకుపైగా అప్పు చేసి కాళేశ్వరం ప్రాజెక్టును ఏటీఎంలా వాడుకుంటే, ఇప్పుడు కాంగ్రెస్ పాలకులు 'మూసీ పునరుజ్జీవం' పేరుతో మరో లక్షన్నర కోట్లు అప్పు చేసి ఏటీఎం మాదిరిగా వాడుకోవాలని చూస్తుం డటం బాధాకరం. ఈ అప్పుల భారమంతా వివిధ రకాల పన్నుల రూపంలో ప్రజలపై భారం పడు తుంది. ఇప్పటికే రాష్ట్ర ప్రజలు తీవ్రమైన ఆర్థిక ఇబ్బందుల్లో ఉన్నారు. నాబార్డ్ సంస్థ ఇచ్చిన "ఆల్ ఇండియా రూరల్ ఫైనాన్షియల్ ఇంక్లూజన్ సర్వే" నివేదిక ప్రకారం.. దేశంలోనే అత్యధికంగా అప్పుల్లో ఉన్నది తెలంగాణ వాసులే. రాష్ట్రంలో ఒక్కో కుటుంబంపై సగటున రూ.1,29,599 అప్పు ఉంది. జాతీయ సగటు కంటే రూ.40 వేలు ఎక్కువ. రాష్ట్రంలో దాదాపు 92 శాతం కుటుంబాలు అప్పుల్లోనే ఉన్నాయి. జాతీయ సగటు 52 శాతం కుటుంబాలు మాత్రమే.

వాస్తవానికి భారతీయ జనతా పార్టీ 'మూసీ ప్రక్షాళన'కు వ్యతిరేకం కానేకాదు. కానీ తెలం గాణ రాష్ట్రం, ప్రజల ఆర్థిక పరిస్థితి అత్యంత క్లిష్ట పరిస్థితుల్లో ఉన్న ఈ తరుణంలో మళ్లీ లక్షన్నర కోట్ల రూపాయలకుపైగా అప్పులు చేసి మూసీ పునరుజ్జీవం పేరుతో ప్రజలపై మోయలేని భారం మోయడాన్ని మాత్రమే వ్యతిరేకిస్తోంది.

పేదల ఇండ్లను కూల్చివేయడాన్ని తీవ్రంగా వ్యతిరేకిస్తోంది. ఈ విషయంలో కాంగ్రెస్ ప్రభుత్వ తీరును నిరసిస్తూ మూసీ బాధితుల పక్షాన రేపు (ఈనెల 25న) ఇందిరాపార్క్ ధర్నా చౌక్ వద్ద భారతీయ జనతా పార్టీ రాష్ట్ర అధ్యక్షులు జి.కిషన్ రెడ్డి ఆధ్వర్యంలో చేపట్టిన మహాధర్నాను విజయవంతం చేయాలని కోరుతున్నా. మూసీ బాధితులు, ప్రజలు పెద్ద ఎత్తున మహా ధర్నా కార్యక్రమంలో పాల్గొనాలని విజప్తి చేస్తున్నాం.

## ప్రధాని మోడీ, అమిత్ షాలతో ఒమర్ భేటీ

(మొదటి పేజీ తరువాయి)

విషయమై కేంద్రాన్ని కోరుతూ ఇటీవల ఒమర్ మంత్రివర్గం తీర్మానం చేసిన సంగతి తెలిసిందే. దానికి లెఫ్టినెంట్ గవర్నర్ మనోజ్ సిన్హా ఆమోదం కూడా తెలిపారు. తాజాగా భేటీలో ఆ తీర్మానాన్ని ప్రధానికి అందించనున్నట్లు తెలుస్తోంది. ప్రధానిని కలుసుకోవడానికి ముందు కేంద్ర హోంమంత్రి అమిత్ షాతో ఒమర్ భేటీ అయిన సంగతి తెలిసిందే. జమ్మూకశ్మీర్‌కు తిరిగి రాష్ట్ర హోదా కల్పించాలనే అంశంపై వీరిద్దరూ చర్చించినట్లు సమాచారం. ఈమేరకు జాతీయమీడియా కథనాలు వెల్లడించాయి. ఈ భేటీలో కొత్తగా ఎన్నికైన ప్రభుత్వానికి కేంద్రం మద్దతు తెలపడంతో పాటు, రాష్ట్ర హోదా పునరుద్ధరణపై కేంద్ర మంత్రి హామీ ఇచ్చినట్లు సమాచారం. జమ్మూకశ్మీర్ కేంద్రపాలిత ప్రాంతంగా మారిన తర్వాత తొలిసారి ఇటీవల ఎన్నికలు జరిగాయి. ఈ ఎన్నికల్లో ఎన్‌సీ- కాంగ్రెస్ కూటమి విజయం సాధించగా.. ఒమర్ అబ్దుల్లా సీఎంగా బాధ్యతలు చేపట్టారు. అనంతరం జమ్మూకశ్మీర్‌కు రాష్ట్ర హోదాను పునరుద్ధరించాలని రాష్ట్ర కేబినెట్ తీర్మానాన్ని ప్రవేశపెట్టింది. ఈ తీర్మానాన్ని లెఫ్టినెంట్ గవర్నర్ మనోజ్ సిన్హా సైతం ఆమోదించారు. జమ్మూకశ్మీర్‌కు తిరిగి రాష్ట్ర హోదా పునరుద్ధరణ అంశంపై వీరిద్దరూ చర్చించినట్లు సమాచారం. ఈ పునరుద్ధరణ ప్రక్రియను ప్రారంభించే యోచనలో కేంద్రం ఉందని, ఈ మేరకు హామీ లభించిందని కథనాలు వెలువడ్డాయి. జమ్మూకశ్మీర్ కేంద్రపాలిత ప్రాంతంగా మారిన తర్వాత తొలిసారి ఇటీవల జరిగిన ఎన్నికల్లో ఎన్‌సీ-కాంగ్రెస్ కూటమి విజయం సాధించింది. 90 స్థానాల శాసనసభలో ఎన్‌సీ 42 సీట్లలో, కాంగ్రెస్ 6 స్థానాల్లో నెగ్గింది.

## సింగరేణి కార్మికులకు నేడే దీపావళి బోనస్ చెల్లింపు

(మొదటి పేజీ తరువాయి)

చేశారు. గత ఏడాది చెల్లించిన దీపావళి బోనస్ కన్నా ఇది రూ.50 కోట్లు అధికం కావడం విశేషం. శుక్రవారం మధ్యాహ్నం కల్లా దీపావళి బోనస్‌ను కార్మికుల ఖాతాల్లో జమ చేయాల్సిందిగా డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క మల్లు స్పష్టం చేశారు. దీపావళి బోనస్ కింద ఒక్కొక్క కార్మికుడు రూ.93,750లు అందుకోనున్నారు. దీపావళి బోనస్ సంస్థలో పనిచేస్తున్న దాదాపు 40,000 మంది కార్మికులకు వర్తిస్తుంది.

జే.బీ.సీ.సీ.ఐ. విధానాల్లో భాగంగా కంపెనీలు సాధించిన ఉత్పత్తి పరిమాణం ఆధారంగా కార్మికుల శ్రమకు ప్రోత్సాహకంగా ఈ బోనస్ ను చెల్లించే పద్ధతి గత కొన్నేళ్లుగా అమలులో ఉంటోంది. ఈ ఏడాది కూడా కోల్ ఇండియా స్థాయిలో తీసుకున్న నిర్ణయానికి అనుగుణంగా దీపావళి పండుగకు ముందే చెల్లింపులు జరిగేలా రాష్ట్ర ఉపముఖ్య మంత్రి వర్యులు భట్టి విక్రమార్క మల్లు ఆదేశాలిచ్చారు.

**ఈ నెలలో దీపావళి బోనస్‌తో కలిపి కార్మికులకు దాదాపు రూ.1250 కోట్ల చెల్లింపులు :**

కాగా ఇటీవలే సింగరేణి ఉద్యోగులందరికీ 33 శాతం లాభాల వాటా కింద 796 కోట్ల రూపాయలను కంపెనీ పంపిణీ చేసిన విషయం తెలిసిందే. ఒక్కొక్క కార్మికుడికి సగటున 1 లక్షా 90 వేల రూపాయలు అందాయి. అలాగే ఔట్ సోర్సింగ్ సిబ్బందికి రూ.5 వేల చొప్పున చెల్లించారు. అలాగే పండుగ అడ్వాన్స్ కింద ఒక్కొక్క కార్మికునికి 25వేల రూపాయలు చొప్పున మరో 90 కోట్ల రూపాయలను కంపెనీ చెల్లించింది.

ఇప్పుడు దీపావళి బోనస్ కింద ఒక్కొక్కరికి సగటున రూ.93,450లు లభిస్తాయి. మొత్తమ్మీద ఈ నెల రోజుల వ్యవధిలో దీపావళి బోనస్, లాభాల వాటా, పండుగ అడ్వాన్స్ కింద రూ.1250 కోట్ల ను కంపెనీ చెల్లించింది. ఈ విధంగా సగటున సింగరేణి ఉద్యోగులు ఈ నెల రోజుల కాలంలో ఒక్కొక్కరు సుమారు మూడు లక్షల రూపాయల వరకు అందుకున్నారు.

ఉపముఖ్యమంత్రి ఆదేశాలపై సింగరేణి సంస్థ సీఎండీ ఎన్. బలరామ్ బోనస్ చెల్లింపుపై తగు ఏర్పాటు చేయాలని ఆయన పర్సనల్ మరియు ఫైనాన్స్ విభాగం అధికారులను ఆదేశించారు. ఈ బోనస్ డబ్బులను దుబారా చేయవద్దని, ప్రభుత్వ పొదుపు సంస్థల్లో దాచుకోవాలని లేదా కుటుంబ అవసరాలకు అనుగుణంగా జాగ్రత్తగా వెచ్చించాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

## ధాన్యం కొనుగోళ్లకు 20 వేల కోట్ల నిధులు

(మొదటి పేజీ తరువాయి)

సమావేశం అయ్యారు. ఈ సమావేశంలో పాల్గొన్న మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి ప్రారంభ ఉపన్యాసంలో రాష్ట్రంలోనీటిపారుదల అభివృద్ధిని, సూర్యాపేట ప్రాశస్త్యాన్ని గవర్నర్ కు వివరించారు. ముందెన్నడూ లేని రీతిలో తెలంగాణా రాష్ట్రంలో సన్నాలు పండించినందుకు గాను 500 రూపాయల బోనస్ ను రాష్ట్ర ప్రభుత్వం అందిస్తుందన్నారు.

తెలంగాణా రాష్ట్రాన్ని సశ్యశ్యామలంగా రూపు దిద్దేందుకు గాను నీటిపారుదల రంగం మీద 28,000 కోట్లు ఖర్చు పెడుతుందన్నారు. ప్రాజెక్ట్ ల నిర్మాణాలతో పాటు అనకట్టల ఆధునీకరణ పనులను వేగవంతంగా జరిపేందుకు గాను ప్రణాళికలు రూపొందించుకున్నట్లు ఆయన తెలిపారు.

ప్రతి సంవత్సరం కొత్తగా సాగులోకి లక్ష ఎకరాల కొత్త ఆయకట్టును సాగులోకి తేవాలి అన్నదే రాష్ట్ర ప్రభుత్వ సంకల్పం అన్నారు.మొత్తం ఈ ఇదేండ్ల కాలంలో 30 లక్షల కొత్త ఆయకట్టును సాగులోకి తేనున్నట్లు ఆయన తెలిపారు. జనవరి నుండి రాష్ట్రంలో తెల్ల కార్డు దారులందరికి సన్న బియ్యం అందించనున్నట్లు ఆయన చెప్పారు.

సూర్యాపేట జిల్లాను సస్యశ్యామలం చేస్తామన్నారు.ఇప్పటికే వ్యవసాయ రంగంలో అభివృద్ధి సాధిస్తున్న సూర్యాపేట జిల్లా సిమెంట్ పరిశ్రమలు,రైస్ మిల్లులతో పారిశ్రామిక రంగంలోను అద్భుతమైన ఫలితాలు సాధిస్తుందన్నారు.చారిత్రాత్మకమైన నేపద్యానికి సూర్యాపేట బలమైన పునాదులు వేసిందన్నారు. జాగిర్దారులకు, జమీందారుల,వ్యతిరేకంగా ఉద్యమించింది ఈ గడ్డ మీద నుండే నని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి గవర్నర్ దృష్టికి తీసుకు వచ్చారు. నైజాం కు వ్యతిరేకంగా జరిగిన తెలంగాణా సాయుధ రైతంగా పోరాటానికి ఊపిరి లూదినది కుడా ఇక్కడి నుండే నని ఆయన గుర్తు చేశారు. కొత్తగా ఏర్పడ్డా, అభివృద్ధి లో తెలంగాణా రాష్ట్రం అద్భుతమైన ఫలితాలు సాధిస్తుందన్నారు.

చిన్న రాష్ట్రం అయినా ఆర్థికాభివృద్ధితో సుసంపన్నంగా నిలదొక్కుకుం దన్నారు. పారిశ్రామిక రంగంలో వేగవంతమైన అభివృద్ధి సాధిస్తుందని ఇక్కడ పెట్టుబడులు పెట్టేందుకు ప్రపంచం నలుమూలల నుండి పారిశ్రామిక వేత్తలు బారులు తిరుతున్నారని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి గవర్న జిష్ణుదేవ్ వర్మ కు వివరించారు.

## ప్రైవేట్ దళారులకు 2100 అమ్ముకొని రైతులు 700 నష్టపోతున్నారు

(మొదటి పేజీ తరువాయి)

ఫోటోలకు ఫోజులిచ్చి చ్చారు. రైస్ మిల్స్ అలాట్మెంట్ ఇంకా చేయ లేదు. రైతులు కల్లాల దగ్గర వడ్లు అరబోసు కుంటున్నారు. వర్షాలకు ధాన్యం తడిసిపోతుంది. కొను గోలు కేంద్రాలు ఏర్పాటు చేసి 5 రోజులైనా ఇంకా ప్రభుత్వం కొనటం లేదు.దరిమిలా రైతులు మధ్య దళారులకు ధాన్యం అమ్ముకోవాల్సిన పరిస్థితి వచ్చింది. మద్దతు ధర 2300 మీరు ఇస్తానన్న బోనస్ 500 కలిపి క్వింటాలు 2800 రూపాయలకు ప్రభుత్వం కొను గోలు చేయాలి. నామమాత్రపు కొనుగోలు కేంద్రాలు ప్రారంభించి వడ్లు జోకటం లేదు. రైతులు ప్రైవేట్ దళారులకు 2100 అమ్ముకొని 700 నష్టపోతున్నారు.గత పదేండ్ల కాలంలో రైతులు ఎన్నడూ కూడా మధ్య దళారులకు వడ్లు అమ్మకోలేదు.కేసీఆర్ ఉన్న కాలంలో రైతులు వడ్లు కొనుగోలు కేంద్రాల్లోనే అమ్ముకున్నారు. పదేండ్లలో మొదటిసారి రైతులు దళారులకు అమ్మ కుంటు న్నారు. ఇదేనా కాంగ్రెస్ తెచ్చిన మార్పు? పంట కొనుగోలు చేయడంలో కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యం స్పష్టంగా కనబడు తుంది. రైతుల దగ్గర పంట కొన్న ప్రైవేట్ దళారులు మోసం చేస్తే ఎవరు బాధ్యత వహిస్తారు. గతంలో ఇలాంటి సంఘటనలు జరిగినయి. కొనుగోలు కేంద్రాలు లెట్ చేయడం వల్ల రైతులు ప్రైవేట్ దళారులకు అమ్ముకుంటు న్నారు.500 రూపాయల బోనస్ ఎగ్గొట్టడానికే ప్రభుత్వం వడ్లు కొనడంలో జాప్యం చేస్తుంది.అగ్రికల్చర్ పోర్టల్‌లో ప్రతి రైతు పండించిన పంట లెక్కలు ఉన్నాయి. ప్రైవేట్ వ్యాపారులకు అమ్మిన వారికి కూడా ఎకరానికి 26 క్వింటాళ్లతో ప్రతి క్వింటాలుకు, అన్ని రకాల వడ్లకు 500 బోనస్ ఇవ్వాలి.కొనుగోలు కేంద్రాలు పూర్తి స్థాయిలో ఏర్పాటు చేసి రైస్ మిల్స్ అలాట్మెంట్ చేయాలి,అన్ని రకాల వడ్లకు 500 రూపాయల బోనస్ ఇచ్చి ప్రభుత్వమే ప్రతి గింజ కొనుగోలు చేయాలి అని డిమాండ్ చేశారు.

## డిపిఆర్ లేకుండానే మూసీ పునరుద్ధరణ

### ప్రభుత్వ తీరుపై మండిపడ్డ ఈటెల

హైదరాబాద్,అక్టోబర్ 24 (నమస్తే ఉదయం): మూసీ పునరుజ్జీవానికి ఇళ్లు కూల్చడం దేనికని మల్కాజిగిరి ఎంపీ ఈటల రాజేందర్ ప్రశ్నించారు. మూసీ విషయంలో ప్రభుత్వం ఇష్టారీతిన వ్యవహరిస్తున్న తీరును భాజపా ఖండిస్తోందన్నారు.

భాజపా ఎప్పుడూ పేదల పక్షానే ఉంటుందని స్పష్టం చేశారు. డీపీఆర్ లేకుండా మార్కింగ్ ఎట్లా చేస్తావ్ రేవంత్.. నిన్ను ఎన్నుకుంటే పేదల బతుకు ఇట్లా ఆగం చేస్తావా? గత ప్రభుత్వం ఎల్ఆర్ఎస్ పేరిట క్రమబద్ధీకరణ చేసింది. వాటిని భారాస స్థిరాస్తి వ్యాపారులు పేదలకు విక్రయించారు. మళ్లీ ఇప్పుడు ఆ పార్టీ నేతలే మొసలి కన్నీరు కారుస్తున్నారు. చెరువులన్నీ క్లీన్ చేయండి అభినందిస్తాం. డ్రైనేజీ నీరు మూసీలో కలవకుండా చూడండి. మూసీ ప్రక్షాళనకు మేం వ్యతిరేకం కాదు. అందులో విష రసాయనాలు కలుస్తున్నాయి. వాటిని అరికట్టి డైవర్షన్ చెయ్యి చాలు. ఎక్కడైనా ఎస్టీపీలు పనిచేస్తున్నాయా? పనిచేస్తే ఇంకా దుర్గంధం ఎందుకుంది. గత సీఎం హుస్సేన్ సాగర్‌ను ఎందుకు బాగు చేయలేదు. సచివాలయం బఫర్ జోన్‌లో



కట్టలేదా? పేదల ఉసురు మంచిది కాదు.. బుల్డోజర్లకు అడ్డంగా పడుకుంటాం. శుక్రవారం జరిగే మహాధర్నాకు ప్రజలు పెద్ద ఎత్తున తరలిరావాలి' అని ఈటల పిలుపునిచ్చారు.

## పెట్టుబడి పేరుతో 24కోట్లు కాజేసిన నిందితుల అరెస్ట్

హైదరాబాద్,అక్టోబర్ 24 (నమస్తే ఉదయం): పెట్టుబడి పేరుతో బాధితుల నుంచి రూ.24 కోట్లు కాజేసిన నలుగురు నిందితులను హైదరాబాద్ ఆర్థిక నేరవిభాగం పోలీసులు అరెస్టు చేశారు. బైబ్యాక్ పేరుతో రూ. 17 లక్షలు పెట్టుబడి పెడితే.. 100 నెలల పాటు ప్రతి నెలా రూ.30వేలు ఇస్తామని ఆకర్షించారు. దీనికి అదనంగా పలు ప్రాంతాల్లో స్థలాలను రిజిస్ట్రేషన్ చేస్తామని చెప్పారు. ఆ భూమిలో గంధపు చెట్లు నాటి 13-15 ఏళ్లకు 50శాతం వాటా ఇస్తామని నమ్మబలికారు. పెట్టుబడి పెట్టిన మొదటి రెండు నెలలు చెప్పిన విధంగా రూ.30 వేలు చొప్పున ఇచ్చారు. ఆ తర్వాత డబ్బులు చెల్లించడం ఆపేశారు. దీంతో మోసపోయామని గ్రహించిన బాధితులు పోలీసులను ఆశ్రయించారు. మొత్తంగా 120 మంది బాధితుల నుంచి రూ. 24 కోట్లు వసూలు చేసినట్లు పోలీసులు తెలిపారు.

# ప్రతి పౌరునికి ఉచిత వైద్యమే ప్రధాన లక్ష్యం

- సమాజంలోని పౌరుల భవిష్యత్తు వైద్య విద్యార్థుల చేతుల్లో ఉంది
- వైద్య వృత్తి , సేవలో తృప్తి ఉంటుంది
- 90 శాతం వైద్యం స్థానిక ప్రాంతంలోనే జరగాలి, నగరాలకు వైద్యం కోసం వెళ్లకూడదు
- వైద్య ఆరోగ్య శాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ
- వైద్య వృత్తికి న్యాయం చేయాలి
- నిరంతరం వైద్య విద్యా కొనసాగుతూ... టెక్నాలజీతో పోటీపడాలి
- వైద్య సేవలో ఏలాంటి లోటుపాట్లు జరగనివ్వద్దు
- ఫ్రెండ్లీ డాక్టర్‌గా ఉంటూ.. రోగులకు సేవలు అందించాలి
- దేవాదాయ ధర్మాదాయ పర్యావరణ శాఖ మంత్రి కొండా సురేఖ

మెదక్,అక్టోబర్ 24 (నమస్తే ఉదయం): స్థానిక మెదక్ పట్టణంలోని పిల్లి కొట్యాల్‌లో ఉన్న ప్రభుత్వ వైద్య కళాశాలలోని ఎంబీబీఎస్ మొదటి సంవత్సరం తరగతుల ప్రారంభోత్స వానికి ముఖ్యఅతిథిగా వైద్య ఆరోగ్యశాఖ మంత్రులు



దామోదర్ రాజనర్సింహ, దేవాదాయ ,ధర్మాదాయ పర్యావరణ శాఖ మంత్రి కొండా సురేఖ ఎంపీ రఘునందన్ రావు, మెదక్ ఎమ్మెల్యే మదనపల్లి రోహిత్ రావ్, ఎమ్మెల్సీ షేరి సుభాష్ రెడ్డి, జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్ అదనపు కలెక్టర్ వెంకటేశ్వర్లు వైద్య కళాశాల ప్రిన్సిపాల్ రవీందర్ లు ముఖ్య అతిథిలుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా వైద్య ఆరోగ్యశాఖ మంత్రి దామోదర్ రాజ నర్సింహ మాట్లాడుతూ.. తెలంగాణలో ఉన్న ప్రతి ఒక్క పౌరునికి ఉచిత నాణ్యమైన వైద్యం అందించడమే ప్రభుత్వ లక్ష్యమని, సమాజం లోని పౌరుల భవిష్యత్తు వైద్య విద్యార్థుల చేతుల్లో ఉందని, వైద్య వృత్తి లో రోగులకు సేవలు అందించడం తృప్తి గా ఉంటుందన్నారు. 90 శాతం వైద్యం స్థానిక ప్రాంతాల్లో జరగాలని, నగరాలకు వైద్యం కోసం రోగులు వెళ్లకుండా శ్రద్ధ వహించాలన్నారు. 220 పడకల ఆసుపత్రి భవన నిర్మాణం, నర్సింగ్ కళాశాల, పారామెడికల్ కళాశాల, అన్ని రకాల మౌలిక వసతులను వచ్చే విద్యా సంవత్సరం వరకు ప్రారంభించుకోవాలన్నారు.

దేవాదాయ, అటవీ, పర్యావరణ శాఖా మంత్రి కొండా సురేఖ మాట్లాడుతూ విద్యార్థులు వైద్య వృత్తికి న్యాయం చేయాలని, వైద్యవృత్తి చదువుతూనే టెక్నాలజీతో పోటీపడాలన్నారు. వైద్య



సేవలో ఎలాంటి లోటుపాట్లు లేకుండా సేవ చేయాలని యువ డాక్టర్లకు పిలుపునిచ్చారు. ఫ్రెండ్లీ డాక్టర్‌గా ఉంటూ రోగులకు ఉత్తమ సేవలు అందించి నప్పుడే వృత్తికి న్యాయం చేసిన వారు అవుతరాన్నారు. ఆత్మస్థైర్యంతో ముందుకెళ్లి తల్లిదండ్రులకు గురువులకు పేరు ప్రఖ్యాతలు తీసుకు రావాలని విద్యార్థుల సూచించారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ వెంకటేశ్వర్లు, ప్రజా ప్రతినిధులు అధికారులు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## దమ్ముంటే పార్టీ మారిన ఎమ్మెల్యేలపై అనర్హత వేటు వేసి ఎన్నికలు పెట్టండి

- పార్టీ మారిన ఎమ్మెల్యేలపై వేటు వేయాలని కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్సీ జీవన్ రెడ్డి చేసిన వ్యాఖ్యలపై స్పందించిన ఎమ్మెల్యే వేముల ప్రశాంత్ రెడ్డి



హైదరాబాద్, (నమస్తే ఉదయం): పార్టీ మారిన ఎమ్మెల్యేలపై వెంటనే అనర్హత వేటు వేయాలి. మీ పార్టీ ఎమ్మెల్సీ జీవన్ రెడ్డి గారే పార్టీ మారిన ఎమ్మెల్యేలపై అనర్హత వేటు వేయాలని డిమాండ్ చేశారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి,శాసన సభాపతి ప్రసాద్ ,ఎమ్మెల్సీ గుత్తా సుఖేందర్ రెడ్డి త్వరగా నిర్ణయం తీసుకోవాలని డిమాండ్ చేస్తున్న. ఛాలెంజ్ చేస్తున్న.. దమ్ముంటే పార్టీ మారిన ఎమ్మెల్యేల పై అనర్హత వేటు వేసి ఎన్నికలు పెట్టండి. ప్రజాక్షేత్రంలోకి వెళ్దాం.. ప్రజలే న్యాయనిర్ణేతలు. మీ ప్రభుత్వం చేస్తున్న ప్రజా వ్యతిరేక, రైతు వ్యతిరేక చర్యలు, ప్రజాస్వామ్య స్ఫూర్తికి విరుద్ధంగా పోలీసులతో మీరు చేస్తున్న అరాచక పాలన, అరెస్టులు, ప్రశ్నించిన వారిపై మీరు పెడుతున్న కేసులు అన్ని ప్రజలు గమనిస్తున్నారు. ప్రజలు మీకు బుద్ధి చెప్పడానికి సిద్ధంగా ఉన్నారు.



మధుబన్ కాలనీలో రోడ్డు ఆక్రమించి వేసిన డబ్బాలను తొలగిస్తున్న జిహెచ్ఎంసి అధికారులు

## మధుబన్ కాలనీలో ఫుట్పాత్ ఆక్రమణల కూల్చివేతలు..

**రాజేంద్రనగర్,అక్టోబర్ 24(నమస్తే ఉదయం):** ట్రాఫిక్ సమస్యను పరిష్కరించేందుకు రాజేంద్రనగర్ సర్కిల్ అధికారులు ఫుట్ పాత్ ల ఆక్రమణల పై ఉక్కుపాదం మోపారు. డిప్యూటీ కమిషనర్ రవి కుమార్ ఆదేశాల మేరకు సర్కిల్ పరిధిలోని మధుబన్ కాలనీ ప్రధాన రహదారులకు ఇరువైపుల ఉన్న ఫుట్ పాత్ ఆక్రమణలను తొలగించారు. ఇష్టారాజ్యంగా ఫుట్పాత్లను ఆక్రమించుకున్న దుకాణాలు, డబ్బాలు తొలగించారు. ఫుట్పాత్పై ఉన్న బండ్లను, షెడ్లు, దుకాణాలను కూల్చివేశారు. కూల్చివేతలను ఆయా దుకాణాల నిర్వాహకులు అడ్డుకున్నప్పటికీ అధికారులు వాటిని జేసీబీలతో కూల్చివేశారు. ఫుట్పాత్ ఆక్రమణలతో ట్రాఫిక్ సమస్యకు తలెత్తుతుందని టౌన్ ప్లానింగ్ ఏసీపీ శ్రీధర్ తెలిపారు. నిర్మాణాలన్నీ నిబంధనలకు విరుద్ధంగా వెలిశాయని అన్నారు. కూల్చివేతలలో చైన్ మెన్ లు రమేష్, కరణ్ తదితరులు ఉన్నారు.

## నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

**గండిపేట, అక్టోబర్ 24(నమస్తే ఉదయం):** మణికొండ మున్సిపాలిటీ పరిధిలోని పుప్పాల్ గూడ విద్యుత్ సబ్ స్టేషన్ పరిధిలో శుక్రవారం ఉదయం 10:30 నుండి 1:30 వరకు అల్కాపూర్ రోడ్ నెంబర్ 1 నుండి





13 వరకు, మధ్యాహ్నం రెండు నుండి ఐదు గంటల వరకు బాలాజీ నగర్ రోడ్ నెంబర్ 1 నుండి 15 వరకు, అల్కాపూర్ సెక్టర్ 2A,2B,2C,2D వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ఇబ్రహీం బాగ్ విద్యుత్ సెక్షన్ అసిస్టెంట్ ఇంజనీర్ కె సంతోష్ కుమార్ తెలిపారు. విద్యుత్ వినియోగదారులు ఈ అంతరాయానికి సహకరించాలని ఆయన కోరారు.

## గ్రామపంచాయతీ కార్మికులను పర్మినెంట్ చేయాలి

**- సిఐటియు జిల్లా అధ్యక్షులు మండ్ల రాజు**

**నమస్తే ఉదయం, అక్టోబర్ 24(నమస్తే ఉదయం):** మదనాపురం రాష్ట్ర ప్రభుత్వం గ్రామపంచాయతీ కార్మికులను పర్మనెంట్ చేయాలని సిఐటియు జిల్లా అధ్యక్షులు మండ్ల రాజు సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు బొబ్బిలి నిక్సన్ డిమాండ్ చేశారు. గురువారం మదనపురం ఎంపీడీవో కార్యాలయం ముందు గ్రామ పంచాయతీ కార్మికులు ధర్నా చేయడం జరిగింది అనంతరం అధికారులకు



గ్రామపంచాయతీ కార్మికుల సమస్యలు పరిష్కరించాలని వినతి

వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... కనీస వేతనాలు గ్రామపంచాయతీ కార్మికులు నోచుకోవడం లేదని నెలకు 26 వేల రూపాయలు ఇవ్వాలని డిమాండ్ చేశారు.

పిఎఫ్ ఈఎస్ఐ సౌకర్యం కల్పించాలని కోరారు. నవంబర్ నెల 5 6 తేదీల్లో జరిగే 48 గంటల రిలే దీక్షలో కార్మికులు ఎక్కువ సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో కెవిపిఎస్ జిల్లా నాయకులు వెంకట రాములు, గ్రామపంచాయతీ వర్కర్స్ యూనియన్ జిల్లా ఉపాధ్యక్షులు వై అంజి, గ్రామపంచాయతీ వర్కర్స్ యూనియన్ మండల అధ్యక్షులు మధు, కార్యదర్శి జాంగిర్ రాములు, వి రవి నాగన్న ఖాదర్ ఎం భాస్కర్ గాలెన్న మొగులమ్మ, లక్ష్మమ్మ, సైద్రమ్మ, తదితరులు పాల్గొన్నారు.

## బైక్పై నుండి పడి మహిళ మృతి

**కేటిదొడ్డి, అక్టోబర్ 24(నమస్తే ఉదయం):** బైక్ పై వెళ్తున్న ఓ మహిళ ప్రమాదవశాత్తు జారి పడి మృతి చెందింది. ఈ ఘటన గురువారం కేటిదొడ్డి మండలం కుచినెర్ల గ్రామ శివారులో చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి.. మండలంలోని నందిన్నె పోస్ట్మ్యాన్గా విధులు నిర్వహిస్తున్న సుజాత (46) పోస్టు ఆఫీస్ నిమిత్తం మాచర్ల కు వెళుతుండగా కుచినెర్ల గ్రామశివారులో రోడ్డుపై గుంతలు ఉండడం వల్ల బైక్ అదుపు తప్పి ఇద్దరు బైక్ పై నుండి పడ్డారు. ఈ ఘటనలో సుజాత గాయపడగా చికిత్స కోసం రాయచూరుకు తరలిస్తుండగా మార్గమద్యలో ఆమె మృతి చెందింది.



రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన పోస్ట్మ్యాన్ సుజాత







సమావేశంలో మాట్లాడుతున్న రైతు కమిషన్ చైర్మన్ ఏ కోదండ రెడ్డి, రైతు కమిషన్ చైర్మన్ ఏ కోదండరామ్ను సన్మానిస్తున్న డాక్టర్ ఆర్ ఎం సుందరం, చిత్రంలో ఉపకుల పతి జానయ్య

## గ్రామీణ వలసలను ఆపే విధంగా శాస్త్రవేత్తలను పని చేయాలి

**- రైతు కమిషన్ చైర్మన్ ఏ కోదండ రెడ్డి**

**రాజేంద్రనగర్, అక్టోబరు 24(నమస్తే ఉదయం):** గ్రామీణ ప్రాంతాల నుంచి పట్టణాలకు వలసలను అధికట్టేందుకు వ్యవసాయ రంగంలో తగిన సాంకేతిక పరిజ్ఞానాన్ని అభివృద్ధి చేయాలని తెలంగాణ రాష్ట్ర రైతు కమిషన్ చైర్మన్ ఏ కోదండ రెడ్డి శాస్త్రవేత్తలను కోరారు. రాజేంద్రనగర్ లోని జాతీయ వరి పరిశోధనా సంస్థ(ఐఐఆర్ఆర్)లో గురువారం రైతు దినోత్సవాన్ని నిర్వహించారు.

ఈ సమావేశంలో తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, కర్ణాటక రాష్ట్రాలకు చెందిన 500 మంది రైతులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా రైతు కమిషన్ చైర్మన్ ఎ.కోదండ రెడ్డి మాట్లాడుతూ... హరిత విప్లవం సమయంలో వ్యవసాయ శాస్త్రవేత్తల సంఘం చేసిన సేవలను గుర్తు చేసుకున్నారు . తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన రుణమాఫీ పథకాన్ని ఆయన అభినందించారు. రైతు కమిషన్ నివేదికలో పొందుపరిచేందుకు వ్యవసాయ శాస్త్రవేత్తలు, రైతుల సూచనలను పంపాలని ఆయన కోరారు.

సమావేశంలో పాల్గొన్న వ్యవసాయ విశ్వవిద్యాలయం వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ అల్దాస్ జానయ్య మాట్లాడుతూ... మెరుగైన వరి రకాలు భారతదేశంలోనే కాకుండా మొత్తం దక్షిణాసియాలో కూడా గణనీయమైన ప్రభావాన్ని చూపాయని పేర్కొన్నారు. బంగ్లాదేశ్ లోని వరి సాగులో 60 శాతం కంటే ఎక్కువ భారతీయ రకాలు ఉన్నాయన్నారు. రైతులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరిం చేందుకు వారి ఆకాంక్షలను నెరవేర్చేందుకు పరిశోధనలు సాగాలన్నారు. ఇక్రిశాట్కు కొత్తగా నియమితులైన డైరెక్టర్ జనరల్ కూడా ప్రాథమికంగా రైస్ శాస్త్రవేత్త అని గుర్తు చేశారు. రైస్ రీసెర్చ్ ఇనిస్టిట్యూట్ డైరెక్టర్ డాక్టర్ ఆర్ ఎం సుందరం తన స్వాగత ప్రసంగంలో ఎక్రిప్ నుంచి ఇండియన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ రైస్ రీసెర్చ్గా అభివృద్ధి చెందిన వరకు జరిగిన వివరాలను వివ రించారు. వాతావరణ మార్పులు మార్కెటింగ్ సవాళ్లు కారణంగా దేశంలోని రైతులు ఎదుర్కొంటున్న సవాళ్ల గురించి సైన్స్ అండ్ టెక్నాలజీ సాయంతో అభివృద్ధి చెందుతున్న సమ స్యలను పరిష్క రించేందుకు ఐఐఆర్ ఆర్ దృష్టి సాధించిందన్నారు.

అగ్రికల్చరల్ టెక్నాలజీ అప్లికేషన్ రీసెర్చ్ ఇనిస్టిట్యూట్ (అటారీ) డైరెక్టర్ డాక్టర్ షేక్ ఎన్ మీర మాట్లాడుతూ గత శతాబ్దపు 60ల చివరలో జయ వరి రకం యొక్క మొదటి విడుదల నుంచి అన్నదాతకు చేస్తున్న సేవలను గుర్తు చేసుకున్నారు. అన్నదాతల సమస్యల పరిష్కారానికి కృషి విజ్ఞాన కేంద్రాలు, స్వచ్ఛంద సంస్థలు, యూనివర్సిటీ విస్తరణ విభాగ అనుబంధ శాఖలు పనిచేయాలన్నారు. ఈ సందర్భంగా రైతులందరికీ స్థానిక భాషలో వరి సంబంధిత సాహిత్యం, విత్తనాలను పంపిణీ చేశారు. వరిలో ఆధునిక సాంకేతికకు ఉపయోగించి అధిక దిగుబడి సాగించిన ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, కర్ణాటక రాష్ట్రాలలోని పలువురు రైతులను ఈ సందర్భంగా సన్మా నించారు. రైతులు అడిగిన ప్రశ్నలకు వరి శాస్త్రవేత్తలు సమాధానాలు ఇచ్చారు. ఈ సమావేశంలో ఐఐఆర్ఆర్ విభాగాల అధిపతులు, శాస్త్రవేత్తలు పాల్గొన్నారు.







వరి పరిశోధన సంస్థ పంట పొలాలను పరిశీలిస్తున్న రైతు కమిషన్ చైర్మన్ కోదండ రెడ్డి, మాట్లాడుతున్న డాక్టర్ ఆర్ ఎం సుందరం

## ఎల్.ఆర్.ఎస్ దరఖాస్తులను వేగవంతంగా పరిష్కరించాలి: కలెక్టర్ సంతోష్

**గద్వాల జిల్లా ప్రతినిధి, అక్టోబర్ 24(నమస్తే ఉదయం):** వచ్చిన ఎల్.ఆర్.ఎస్ దరఖాస్తులను క్షేత్ర స్థాయిలో పరిశీలించి వేగవంతంగా పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ బి.యం. సంతోష్ అన్నారు. గురువారం గద్వాల్ మున్సిపల్ పరిధి, ఎర్రవల్లిలో ఎల్.ఆర్.ఎస్ దరఖాస్తులను క్షేత్రస్థాయిలో మొబైల్ యాప్ ద్వారా నిర్వహిస్తున్న విధానాన్ని అదనపు కలెక్టర్ లక్ష్మి నారాయణతో కలిసి కలెక్టర్ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... ప్రభుత్వం జారీ చేసిన ఆదేశాల ప్రకారం ఎల్.ఆర్.ఎస్ దరఖాస్తులను సక్రమంగా పరిశీలించి ప్రతి దరఖాస్తు వివరాలను ఆన్లైన్లో నమోదు చేయాలని అధికారులకు ఆదేశించారు. క్షేత్రసందర్శనలో భాగంగా మొబైల్ యాప్ను ఉపయోగించి ఎల్.ఆర్.ఎస్ దరఖాస్తు వివరాలను తెలుసుకున్నారు. లేఅవుట్ ప్లాట్స్ ప్రాంతాన్ని , ప్లాట్ గుర్తింపు కోసం ఏర్పాటు చేసిన రాళ్లను ఆయన పరిశీలించారు. లేఅవుట్ పేర్లు, యజమాని వివరాలు, చదరపు గజాల పరిమాణం, రోడ్డు ప్రభావిత ప్రాంతం వంటి అంశాలను పూర్తి స్థాయిలో నమోదు చేయాలని అధికారులకు ఆదేశించారు. ప్లాట్ ఫోటోలను, లాటిట్యూడ్-లంగిట్యూడ్ నాలుగు పైపులు, డాక్యుమెంట్ల అప్లోడ్ విషయంలో ముఖ్యంగా లేఅవుట్ సంబంధిత పత్రాలపై పూర్తి జాగ్రత్త వహించాలని సూచించారు. ప్రభుత్వ భూములను గుర్తిస్తూ, భూములు నీటి వనరుల బఫర్ జోన్ , నాలా, చెరువులు, కోర్టు కేసులు ఇలాంటి విషయాలను పరిశీలించుకునలని సంబంధిత అధికారులకు సూచించారు. దరఖాస్తుదారులను సంప్రదించి సమయానుసారం అన్ని దరఖాస్తులను పరిష్కరించాలని అన్నారు. ప్రతిరోజూ వచ్చిన దరఖాస్తులను పూర్తి చేసి మొబైల్ యాప్లో నమోదు చేయడం జరగాలని అన్నారు. ముఖ్యంగా మున్సిపల్, గ్రామ స్థాయిలో నీటి పారుదల శాఖ పెండింగ్ ఎల్.ఆర్.ఎస్ దరకాస్తులను త్వరగా పూర్తిచేయాలని నీటి పారుదల ఈ.ఈ.కు ఆదేశించారు.



ఎల్ ఆర్ ఎస్ దరఖాస్తులను క్షేత్రస్థాయిలో పరిశీలిస్తున్న కలెక్టర్ సంతోష్

గ్రామపంచాయతీ, మున్సిపల్, రెవెన్యూ, నీటి పారుదల శాఖల అధికారులు సమన్వయంతో పని చేసి పెండింగ్ దరకాస్తులను పరిష్కరించాలని ఆదేశించారు. అనంతరం ఎర్రవల్లి మండలంలోని ఎర్రవల్లి, తిమ్మాపూర్ గ్రామాల్లో ఎల్.ఆర్.ఎస్ దరఖాస్తులను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా అన్ని డాక్యుమెంట్లు, లేఅవుట్ మ్యాప్లను పరిశీలించారు.

ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ సంతోష్ మాట్లాడుతూ... డిపిఓ, పంచాయతీ కార్యదర్శిలకు పెండింగ్ దర ఖాస్తులను త్వరగా పూర్తిచేయాలని ఆదేశించారు. ముఖ్యంగా అప్రోచ్ రోడ్లు,రహదారికి ప్రభావిత ప్రాంతాలపై ప్రత్యేకంగా దృష్టి పెట్టాలని అన్నారు. సమీపంలోని నీటి వనరులను పర్యవేక్షించాలని నీటి పారుదల శాఖ అధికారులకు ఆదేశించారు. ఆన్లైన్లో ఎటువంటి పొరపాట్లు జరగకుండా చూసుకోవాలని, సంబంధిత దరఖాస్తుదారులను కాల్ చేసి, పెండింగ్ దరఖాస్తులను త్వరగా పూర్తి చేయాలని ఆదేశించారు.

ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ దశరథ్, డిపిఓ శ్యాంసుందర్, ఇరిగేషన్ ఈ.ఈ శ్రీనివాస రావు, టౌన్ ప్లానింగ్ అధికారి కుర్మన్న, ఆర్.ఐ.లు, ఎ.ఈ.లు, పంచాయత్ సెక్రటరీ, మున్సిపల్ అధికారులు,తదితరులు పాల్గొన్నారు.

## అక్రమ బ్లాస్టింగ్ పలువురికి తీవ్ర గాయాలు

### అక్రమ బ్లాస్టింగ్తో గాయాలపాలైన యువకుడు

**గద్వాల జిల్లా ప్రతినిధి, అక్టోబర్ 24(నమస్తే ఉదయం):** గట్టు మండలంలో నిర్మిస్తున్న భారత్ మాల రోడ్డు నిర్మాణ పనుల కోసం సమీపంలో గుట్టల నుంచి ఎలాంటి అనుమతులు లేకుండా కాంట్రాక్టర్లు అక్రమంగా బ్లాస్టింగ్ చేయడంతో ఇద్దరు తీవ్రంగా గాయపడ్డారు. గత కొన్ని రోజులుగా గట్టు మండలం సల్కాపురం శివారులోని గుట్టల నుంచి జోరుగా బ్లాస్టింగ్ తవ్వకాలు జరుగు తున్నా సంబంధిత అధికారులు గానీ పోలీసులు గానీ పట్టించు కోవడంలేదని స్థానికులు ఆరోపిస్తున్నారు. భారత మాల రోడ్డు కాంట్రాక్టర్లు చుట్టుపక్కల పొలాల రైతులకు సమాచారం ఇవ్వకుండా బ్లాస్టింగ్ చేయడంతో పొలంలో పని చేస్తున్న నవీన్ కుమార్ కు తీవ్రగాయాలయ్యాయి. అదే విధంగా పద్మమ్మ అనే మహిళ నడుము పై రాయి పడటంతో గాయలయ్యాయి. అక్రమంగా బ్లాస్టింగ్ చేస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరారు. కాంట్రాక్టర్ నిర్లక్ష్యం వల్ల గతంలో ఓ వ్యక్తి బ్లాస్టింగ్ కు ప్రాణాలు కోల్పోయాడని, తాజాగా మరి కొందరు గాయపడ్డారని, జిల్లా కలెక్టర్ బిఎం సంతోష్ తక్షణమే అక్రమ బ్లాస్టింగ్ పనులను నిలిపి వేసి చర్యలు తీసుకోవాలని సల్కాపురం గ్రామస్తులు కోరారు.



జనరల్ న్యూస్ GENERAL NEWS
శుక్రవారం 25, అక్టోబర్ 2024
నమస్తే ఉదయం
తెలుగు దినపత్రిక


# జాతియ స్థాయిలో పదో స్థానంలో ఉత్తమ విశ్వవిద్యాలయంగా తీర్చిదిద్దుతాం..

**- వైస్ చాన్స్‌లర్ అల్దాస్ జానయ్య**

**జనవరి వరకు విశ్వవిద్యాలయానికి పూర్తి స్థాయి అధికారులు**

**విశ్వవిద్యాలయంలో చదివిన పీహెచ్డీ విద్యార్థులకు స్కాలర్షిప్ పెంచుతాం**

**వ్యవసాయ పీహెచ్డీ విద్యార్థుల సేవలను వినియోగించుకుంటాం**


మాట్లాడుతున్న డాక్టర్ ఆల్దాస్ జానయ్య

**రాజేంద్రనగర్, అక్టోబరు 24(నమస్తే ఉదయం):** ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణా వ్యవసాయ విశ్వవిద్యాలయాన్ని జాతీయ స్థాయి లో అత్యుత్తమ పది సంస్థ లలో నిలపడానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని ఉపకులపతి ప్రొఫెసర్ ఆల్దాస్ జానయ్య పిలుపునిచ్చారు. ప్రస్తుతం విశ్వవిద్యాలయం 37 వ ర్యాంకు లో ఉందని రానున్న మూడేళ్ల లో విశ్వ విద్యాలయం పది లోపు ర్యాంక్ సాధించాలని ఆయన సూచించారు. ఈ మధ్యనే ఉపకులపతి బాధ్యతలు స్వీకరించిన ఆల్దాస్ జానయ్య గురువారం రాజేంద్ర నగర్ లోని విశ్వవిద్యాలయం ఆడిటోరియం లో ఉద్యోగులు, విద్యార్థులతో సమావేశం అయ్యారు. జాతీయ, అంతర్జాతీయ స్థాయి లో ఈ ఉప కులపతి సహా ఇప్పటికి తాను 15 బాధ్యత లు చేపట్టానని వివరించారు. తనకు ఈ అవకాశం కల్పించిన కులపతి, రాష్ట్ర గవర్నర్, ముఖ్యమంత్రి, ఉప ముఖ్యమంత్రి, వ్యవసాయ మంత్రి కి జానయ్య ధన్యవాదములు తెలిపారు. సమష్టి కృషితో విశ్వవిద్యాలయాన్ని ముందు కి తీసుకెళదామని పిలుపు నిచ్చారు. జనవరి లోగా విశ్వ విద్యాలయ అధికారుల పదవులని భర్తీ చేస్తామన్నారు.సాంకేతిక అర్హత లేకపోయినా కొన్ని ప్రైవేట్ సంస్థలు వ్యవసాయ కోర్సు లలో ప్రవేశాలు చేపట్టడం దురదృష్టం అన్నారు. సామాన్యులకి వ్యవసాయ విద్య ని అందుబాటులోకి తీసుకుని వచ్చేందుకు ప్రత్యేక కోటా సీట్లు భారీ గా పెంచి, ఫీజులు సగానికి తగ్గించామని వివరించారు. విశ్వవిద్యాలయం లోని ఖాళీ లని ప్రభుత్వ విధానాలకి అనుగుణంగా భర్తీ చేయడానికి చర్యలు తీసుకుంటామని జానయ్య తెలిపారు. బోధన, బోధనేతర సిబ్బంది, విద్యార్థుల సమస్యల పరిష్కారానికి అన్ని చర్యలు తీసుకుంటుమన్నారు. తనకి ఎవరితోనూ వ్యక్తిగత విబేధాలు లేవని, విశ్వవిద్యాలయం చట్టం తనకు బైబిల్ అని స్పష్టం చేశారు.తాను పూర్తి ప్రజాస్వామిక విధానాల ని అనుసరిస్తూ నిర్ణయాలు తీసుకుంటానని వివరించారు . ఇదే మాతృక విశ్వవిద్యాలయం అని త్వరలోనే వజరోత్సవం నిర్వహిస్తామని జానయ్య ప్రకటించారు.టాసా అధ్యక్షులు ప్రొఫెసర్ బి. విద్యాసాగర్, బోధనేతర ఉద్యోగుల సంఘం అధ్యక్షులు శ్రీనివాస్ యాదవ్, ప్రధాన కార్యదర్శి అమృత రెడ్డి, విద్యార్థుల ప్రతినిధులు పూజ, బాలకోటి, పూర్వ విద్యార్థుల ప్రతినిధి కవి రాజ్ లు ప్రసంగించారు. జానయ్యని అభినందించారు. ఆయన సారద్యం లో విశ్వవిద్యాలయం అభివృద్ధి లో సాగాలని, తమ అంశాలని సానుకూలం గా పరిష్కారం చేయాలని కోరారు. ఈ కార్యక్రమం లో విశ్వవిద్యాలయ అధికారులు, బోధన, బోధనేతర సిబ్బంది, విద్యార్థులు పెద్ద సంఖ్య లో పాల్గొన్నారు.



ఉపాధ్యాయుల బోధనలను విద్యార్థులతో అడిగి తెలుసుకుంటున్న కలెక్టర్ సంతోష్, మధ్యాహ్నం భోజనం వంటశాలను పరిశీలిస్తున్న కలెక్టర్ సంతోష్

# విద్యార్థులకు నాణ్యమైన విద్యాబోధన అందించాలి: కలెక్టర్ సంతోష్

**బోధన, మధ్యాహ్న భోజనం పనితీరును పరిశీలించిన కలెక్టర్ సంతోష్**

**గద్వాల జిల్లా ప్రతినిధి, అక్టోబర్ 24(నమస్తే ఉదయం):** విద్యార్థులు మంచి మార్కులు సాధించే విధంగా నాణ్యమైన విద్య బోధన అందించాలని జిల్లా కలెక్టర్ బి.యం. సంతోష్ ఆదేశించారు. గురువారం ఎర్రవల్లి మండలం బీచుపల్లిలోని టి.జి. రెసిడెన్షియల్ స్కూల్ & కాలేజీ (బాలుర) ఆకస్మికంగా తనిఖీ చేసి, తరగతి గదులను, హాస్టల్, మెస్ తదితర ప్రాంతాలను కలెక్టర్ పరిశీలించారు.

ఈ సందర్భంగా పాఠశాలలో చదువుతున్న విద్యార్థులతో కలెక్టర్ ముఖాముఖిగా ముచ్చటించి, సబ్జెక్టుల వారిగా వారి విద్యాసామర్థ్యాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ విద్యార్థులు ఈ సంవత్సరం మంచి మార్కులు సాధించడంతో పాటు ఉత్తమ ఫలితాలు వచ్చే విధంగా ఉపాధ్యాయులు చొరవ చూపాలని అన్నారు. విద్యార్థులకు పాఠాలు స్పష్టంగా, అర్థమయ్యే విధంగా బోధించాలని, తద్వారా వారు సులభంగా అర్థం చేసుకుని మంచి ఫలితాలు సాధించగలుగుతారని అన్నారు. ప్రతి విద్యార్థి యూనిఫామ్‌లో ఉండాలని, విద్యార్థులకు ఎప్పటి కప్పుడు పరీక్షలు నిర్వహిస్తూ వారి విద్యాసామర్థ్యాన్ని వర్ధిలిస్తు ఉండాలన్నరు. విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అన్ని మౌలిక వసతులు కల్పించాలని సూచించారు. విద్యార్థులు ఆరోగ్యంగా ఉండటానికి సరైన ఆహారం చాలా అవసరమని, అందుకు మెనూ ప్రకారం ప్రతిరోజు పౌష్టిక ఆహారం అందించాలన్నారు.

పాఠశాల పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని, పాఠశాలలో విద్యార్థులకు ప్రోత్సాహం అందిస్తూ, పాఠశాల ఫలితాలు మెరుగుపరచడానికి ఉపాధ్యాయులు, ప్రిన్సిపల్ అందరూ కలిసి పనిచేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ శ్రీనివాస్, ఉపాధ్యాయులు, తదితరులు పాల్గొన్నారు.

# కొనుగోలు కేంద్రాల్లోనే ధాన్యం విక్రయించాలి

**గద్వాల ప్రతినిధి, అక్టోబర్ 24(నమస్తే ఉదయం):** రైతులు తాము పండించిన ధాన్యాన్ని కొనుగోలు కేంద్రాల్లో విక్రయించి మద్దతు ధర పొందాలని జిల్లా వ్యవసాయ అధికారి ఎం.సక్రియ నాయక్ అన్నారు. గురువారం ధరూర్ మండలం పార్చర్ల క్లస్టర్ పరిధిలోని పార్చర్ల, మన్నాపురం మరియు గుర్రంపల్లి గ్రామాలను వ్యవసాయ అధికారులు సందర్శించి వానకలం 2024లో సీజన్ లో సాగు చేసిన పంటల వివరాలను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. పంటల వివరాలు ఆన్ లైన్ నమోదు చేశారు.

అనంతరం మన్నాపురంలో రైతులకు వరి పంటలో మద్దతు ధర మరియు సన్న రకాలు సాగు చేసిన రైతులకు క్వింటాకు రూ.500 వర్తించే విధి విధానాల గురించి అవగాహన కల్పించారు. రైతులు ప్రభుత్వం ఏర్పాటు చేసిన వరి కొనుగోలు కేంద్రాలకు ధాన్యాన్ని విక్రయిస్తే బోనస్ అందిస్తారన్నారు. గ్రేడ్-ఏ రకం ధాన్యానికి క్వింటాల్‌కు రూ. 2320, గ్రేడ్-బీ రకానికి రూ.2300 మద్దతు ధరతో పాటు క్వింటాకు రూ.500 బోనస్ అందిస్తున్నట్లు తెలిపారు. రైతులు పండించిన ధాన్యాన్ని కొనుగోలు కేంద్రాల్లోనే విక్రయించాలని అన్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక ఏఈఓ ఆంజనేయులు రైతులు తదితరులు పాల్గొన్నారు.

**జిల్లాస్థాయి రైతు సదస్సును విజయవంతం చేద్దాం...**

ఈనెల 26న గద్వాల వ్యవసాయ మార్కెట్ యార్డులో నిర్వహించు జిల్లా స్థాయి రైతు సదస్సుకు రైతులందరూ అధిక సంఖ్యలో తరలివచ్చి విజయవంతం చేయవలసిందిగా రైతులకు జిల్లా వ్యవసాయ అధికారి సక్రియా నాయక్ కోరారు.


ధాన్యం కొనుగోలు కేంద్రాలపై రైతులకు అవగాహన కల్పిస్తున్న వ్యవసాయ శాఖ అధికారులు


బాలుడు కిడ్నాప్‌కు ప్రయత్నించిన వ్యక్తిని కరెంటు స్తంభానికి కట్టేసిన స్థానికులు

# బాలుడి కిడ్నాప్‌కుయత్నం

**కిడ్నాపర్‌ను పట్టుకుని చితకబాదిన స్థానికులు**

**రాజేంద్రనగర్,అక్టోబర్ 24(నమస్తే ఉదయం):** ఓ బాబు కిడ్నాప్‌కు యత్నించిన ఒకరిని స్థానికులు పట్టుకుని చితకబాదారు. రాజేంద్ర నగర్ పోలీస్ స్టేషన్ పరిధిలోని హైదర్ గూడలో గురువారం ఈ ఘటన చోటు చేసుకున్నది.గురువారం సాయంత్రం బాలుడు (10) హైదర్ గూడ ప్రధాన రహదారిపై తన సైకిల్‌పై వెళ్తున్నాడు. బాలుడు ఒక్కడే సైకిల్‌పై వెళ్లడానికి గుర్తించిన కిడ్నాపర్ బాలుడికి మాయ మాటలు చెప్పి సైకిల్ తీసుకొని బాలుని వెనకాల కూర్చోబెట్టుకొని వెళుతున్నాడు.దీంతో భయాందోళనకు సైకిల్ దిగి స్థానికుల వద్దకు చేరుకున్నాడు.అక్కడ కనిపించిన వారికి విషయం చెప్పారు.దీంతో అక్కడున్న వారంతా పోగై అనుమానితుడిని పట్టుకొని దేహశుద్ధి చేశారు. స్తంభానికి కట్టేసి చితకబాదారు.అనంతరం పోలీసులకు అప్పగించారు.తాగిన మైకంలో ఉన్న కిడ్నాపర్ ఇలా చేసినట్లు పోలీసుల దర్యాప్తులో వెల్లడైనట్లు తెలిసింది.


రాజేంద్రనగర్ సర్కిల్ విద్యుత్ ఎస్ ఈ శ్రీరామ్ మోహన్‌ను సన్మానిస్తున్న ఉద్యోగులు

# రాజేంద్రనగర్ విద్యుత్ ఎస్ ఈ, ఎస్ఏఓలను సన్మానించిన ఉద్యోగులు

**రాజేంద్రనగర్, అక్టోబర్ 24(నమస్తే ఉదయం):** రాజేంద్రనగర్ విద్యుత్ సర్కిల్ ఎస్ ఈ శ్రీరామ్మోహన్, ఎస్ ఏ ఓ లోటేశ్వరయ్య లను రాజేంద్రనగర్ డివిజన్ విద్యుత్ ఉద్యోగులు గురువారం మర్యాదపూర్వకంగా కలిసి శాలువాతో సత్కరించారు. ఎస్ఈ, ఎస్ఏవోలను సన్మానించిన వారిలో ఉద్యోగులు రాజు, అర్జున్, శంకర్ రావు, సురేష్, ప్రశాంత్, అశోక్, అర్జున్, మెగనాథ్, వినోద్ తదితరులు వున్నారు.


ఎస్ఏఓ లోకేశ్వరయ్యను సన్మానిస్తున్న ఉద్యోగులు

# ఉపకులపతి అల్దాస్ జానయ్యను సన్మానించిన విశ్వవిద్యాలయం బీసీ ఉద్యోగులు

**రాజేంద్రనగర్, అక్టోబర్ 24(నమస్తే ఉదయం):** ఆచార్య జయశంకర్ తెలంగాణ వ్యవసాయ విశ్వవిద్యాలయం వైస్ ఛాన్స్ లర్ డాక్టర్ జానయ్య ను విశ్వవిద్యాలయంలో పనిచేస్తున్న బీసీ ఉద్యోగులు ఆత్మీయ సన్మాన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ రాములు, డాక్టర్ రజనీకాంత్ ,డాక్టర్ సమీర్ కుమార్, డాక్టర్ ఉపేందర్, డాక్టర్ పద్మావతి, డాక్టర్ శ్రీనివాస్ చారి, డాక్టర్ రాజయ్య , డాక్టర్ సతీష్ , నాన్ టీచింగ్ ఉద్యోగులు మహేశ్వర్, డి ఆర్ నాన్ టీచింగ్ డిప్యూటీ కంట్రోలర్ సత్యనారాయణ, మహేష్ ,సూపర్డెంట్ అసోసియేషన్ సభ్యులు బిక్షపతి, అధ్యక్షులు ప్రధాన కార్యదర్శి దశరథ్, జాయింట్ సెక్రెటరీ రమేష్, కృష్ణ, సంతోష్, జనార్ధన్, భారీ సంఖ్యలో ఉద్యోగులు పాల్గొని వైస్ ఛాన్స్ లర్ కి సన్మాన కార్యక్రమం నిర్వహించారు.


వ్యవసాయ విశ్వవిద్యాలయం నూతన వైస్ ఛాన్స్‌లర్ అల్దా స్ జానయ్యను సన్మానించిన బీసీ ఉద్యోగులు

Printed and Published MEKALA DAMODAR REDDY on behalf of VANITHA Publications, and Printed at Vanitha Graphics, Maruthi Enclave, Attapur, Rajendra Nagar, Ranga Reddy,Telangana-500048. and Published at: H.No. 6-2-4/2, 1st Floor, Shivarampally , NPA, Rajendra Nagar, Ranga Reddy Telangana-500052. Editor: M.Damodhar Reddy. "RNI. Title- Code: TELTEL/2023/87699. Cell: 9492148733